# ఆనందం

-పి. రవీంద్ర



హోరుగాలి రివ్వున వీస్తోంది. ఉరుములతో కూడిన జల్లులు పడుతున్నాయి. ఊరంతా గాఢాంధకారం.

అసలు నేను ప్రయాణం మానెయ్యాల్సింది. ముందు తుఫాను అని తెలిస్తే కదా! బయలుదేరిన తర్వాత ఆకాశం ఒక్కసారిగా మారిపోయింది. ఒక చేత్తో బ్యాగు తీసుకుని వడివడిగా అడుగులు వెయ్యడం ప్రారంభించాను. విసురుగా వీస్తున్నగాలి నన్ను ముందుకు పోనివ్వడం లేదు. మా అత్తగారి ఇల్లు చాలా దూరం. మా ఆవిడకు నొప్పులు ప్రారంభమయ్యాయని, నన్ను అర్జంటుగా బయలుదేరి రమ్మని మా అత్తయ్యగారు ఫోన్ చెయ్యడంతో అర్జంటుగా బయలుదేరాను. కానీ ఇప్పుడు గాలివానలో చిక్కుకుపోయాను.

అప్పుడప్పుడు ఉరుముతుండటంతో, ఆ వెలుగునే ఆసరాగా చేసుకుని ముందుకు సాగి పోతున్నాను. అప్పటికే నా బట్టలన్నీ తడిసి ముద్దయిపోయాయి. హోరుగాలికి చలి కూడా పెడుతోంది.

ఫ్యాంటు జేబును వెతికి చూసుకుంటే సిగరెట్ పెట్టె చేతికి తగిలింధి. బయటికి తీసి చూస్తే పూర్తిగా తడిసిపోయి ఉంది. 'ఈ చలికి సిగరెట్టు ఒకటి కాలిస్తే కొంచెం వెచ్చగా ఉంటుంది' అనుకుని సిగరెట్ పెట్టెని బయటికి తీసాను.

అదే సమయానికి ఆకస్మాత్తుగా ఉరుము ఉరమడంతో ఆ వెలుగులో దూరంగా ఒక బడ్డీ కొట్టు కనబడింది. వర్షం మూలంగా కాబోలు కొట్టువాడు త్వరగా మూసేసి వెళ్ళిపోయాడు.

నేను గబగబా బడ్డీకొట్టు ప్రక్కకు వెళ్ళి నిలబడ్డాను. సిగరెట్ పెట్టెను తెరిచి చూసాను. 'థాంక్ గాడ్. సిగరెట్లు పూర్తిగా తడవలేదు'. ఒక సిగరెట్‌ను నోట్లో పెట్టుకుని జేబులో నుండి లైటర్ తీసి సిగరెట్ వెలిగించుకోబోయాను.

లైటరు వెలగకుండా చాలాసేపు మొరాయించింది. తీరా లైటరు వెలగగానే, సిగరెట్ సరిగా అంటుకోలేదు.

'ఛీ,వెదవ సిగరెట్టు' మనసులోనే తిట్టుకుంటూ సిగరెట్‌ని దూరంగా అవతలకి విసిరేసాను.

తుఫానులాగే నా మనసులో కూడా ఒకటే ఆందోళన. 'అక్కడ మా ఆవిడ పరిస్థితి ఎలా ఉందో' అని. మా ఆవిడ నెలతప్పిన దగ్గరనుండీ

'ఆడపిల్ల కావాలని' నేను, 'కాదు, మగపిల్లవాడే కావాలి' అని మా ఆవిడ పోట్లాడుకునేవాళ్ళం.

ఆ సన్నివేశాలు నాకు గుర్తొచ్చినప్పుడల్లా నాకు నవ్వొస్తుంది. అందరూ మగపిల్లవాడు కావాలని కోరుకునే ఈ రోజుల్లో నేను ఆడపిల్ల కావాలని కోరుకోవడం విచిత్రమే కదా!

అసలు మా ఆవిడ గర్భిణీగా ఉన్నప్పుడే 'స్కానింగ్ తీయిద్దామండి' అంది. అప్పుడు నేను కోప్పడ్డాను. ఎందుకో తెలుసా!

స్కానింగ్‌లో ఆడో, మగో తెలిసిపోతే ఇంక భార్యాభర్తలకు సస్పెన్స్ ఏమీ ఉండదు. అందుకే వద్దని వారించాను.

'ఈ మాయదారి వాన తగ్గితే బావుండును' మనసులో అనుకుని, రోడ్డు వైపు చూసాను. అప్పుడే మెరుపు మెరిసింది. సరిగ్గా అదే సమయానికి ఏదో ఆకారం వెళుతున్నట్టుగా అనిపించింది.

"ఈసమయంలో ఎవరబ్బా?" మనసులో అనుకుని 'హలో....ఎవరూ?" అంటూగట్టిగా పిలిచాను.

నా పిలుపు ఆ ఆకారానికి వినబడినట్లుగా లేదు. ఆ ఆకారం వడివడిగా వెళ్ళిపోతూనే ఉంది. ఆ ఆకారం చేతిలో ఏదో మూటలాంటిది ఉన్నట్లుగా నాకనిపించింది.

"ఎవరైతే నాకెందుకూ, నాకు కొంచెం తోడుగా ఉంటే అంతే చాలు" అనిపించి నేనా ఆకారాన్ని వెంబడించడం మొదలుపెట్టాను. వర్షంతోపాటు గాలి కూడా కొద్దిగా తగ్గుముఖం పట్టింది.

నేను ఆ ఆకారాన్ని వెంబడిస్తూ వెళుతుండగానే, మరలా ఒక మెరుపు మెరిసింది. ఆ వెలుగులో ఆ ఆకారాన్ని చూసిన నాకు మతి పోయినంత పనయ్యింది. ఎందుకంటే! ఆ ఆకారం ఒక స్త్రీది కావడమే. ఆ స్త్రీ వెళుతూ వెళుతూ ఒకచోట ఆగింది. అక్కడ తన చేతిలోనిది ఏదో క్రిందపెట్టబోయింది.

"ఏయ్! ఏమిటది? ఎవర్నువ్వు?" గట్టిగా పిలిచాను.

ఆ స్త్రీ తన చేతిలోనిది క్రింద పెట్టబోతున్నదల్లా, నా అరుపుకి ఒక్కసారి ఉలిక్కిపడి, తన ప్రయత్నాన్ని విరమించుకుని పరుగు లంఘించుకుంది.

ఏమిటిది! నేను పిలిచిన వెంటనే పరుగు ప్రారంభించిందంటే, ఖచ్చితంగా ఆవిడ ఏదో తప్పు చెయ్యబోయిందన్నమాట. ఆవిడ ఎందుకలా పరుగెడుతుందో తెలుసుకోవాలన్న ఉత్సుకత కలిగింది నాలో.

"ఏయ్! అక్కడ ఆగు" అంటూ నేను కూడా ఆమె వెనకాలే పరుగుపెట్టడం ప్రారంభించాను. వెనక్కి తిరిగి చూసిన ఆ స్త్రీ నేను తనను వెంబడిస్తున్నానని తెలుసుకుని, మరికొంత వేగంగా పరుగెట్టసాగింది. నాకింకా పట్టుదల పెరిగింది. చేతిలోని బ్యాగును విసిరేసి, మరింత వేగంగా పరుగెట్టి, ఆ స్త్రీ జుట్టు పట్టుకున్నాను. దానితో ఆ స్త్రీ గజగజ వణికిపోసాగింది.

"నీకు దణ్ణం పెడతాను, నన్నేమీ చెయ్యకు" అంటూ ఆ స్త్రీ ఏడవసాగింది. దానితో అంతవరకూ ఆమె చేతిలో వస్త్రాలతో చుట్టబడినదేదో కదలసాగింది. ఆ కదలికతోపాటు కేర్..... మనే ఏడుపొకటి.

ఆమె చేతిలోనిది అందుకుని, వస్త్రాలను విప్పి చూసాను. అంతే! నాకు నోట మాట రాలేదు. ఆ వస్త్రాలలో చుట్టబడి ఉందో శిశువు. "అంటే! నేను ఆ స్త్రీని గనుక చూసి ఉండకపోతే, ఆ అమాయక శిశువును రోడ్డుపై నిర్దాక్షిణ్యంగా వదిలి వెళ్ళిపోయి ఉండేది. ఆ మర్నాటికి ఆ పసిపాప నిర్జీవమై పోయేది".

నాకు వెంటనే కోపం ముంచుకువచ్చి, ఆ స్త్రీ చెంపమీద 'ఫట్' మని కొట్టాను. అంతేకాకుండా, "ఎందుకు చేసావీ పని?" అంటూ కోపంగా ప్రశ్నించాను.

అప్పుడు ఆమె చెప్పిన కథ నాకు ఏమాత్రం ఆశ్చర్యం కలిగించలేదు. ప్రతిరోజూ పేపర్లో చదివే కథే అది.

"తనను ఎవరో ప్రేమిస్తున్నానంటూ వెంటబడి, గర్భవతి అయ్యాక, ఆనక వాడు ముఖం చాటేస్తే, ఆ పాపఫలాన్ని తను నవమాసాలు మోసి, కని, ఇప్పుడు ఏదో ఒక విధంగా వదుల్చుకోవాలనే ఉద్దేశంతో, రోడ్డుపై వదిలి వెళ్ళిపోడానికి సిద్ధపడిందన్నమాట. ఆ పాప అదృష్టం బావుండి తన 'కంట పడింది. లేకపోతే...!

"నీవు నాకు కనిపించకు. తక్షణమే వెళ్ళిపో" నేను కోపంగా తిట్టడంతో ఆ స్త్రీ అక్కడి నుండి మెల్లగా జారుకుంది.

ఆ పాపను ఆప్యాయంగా పొదివిపట్టుకుని, గబగబా అడుగులు వేయసాగాను. తుఫాను ఎప్పుడో తగ్గుముఖం పట్టింది. నేను, మా అత్తగారిల్లు చేరేటప్పటికి, ఇంటివద్ద దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. అందరూ మెలకువగానే ఉన్నారు. బహుశా డెలివరీ అయి ఉంటుంది.

నన్ను చూడటంతోటే, మా అత్తగారు ఎదురు వచ్చి,

"బాబు పుట్టాడు" అని చెప్పింది.

ఆ మాట నాకు ఏమాత్రం ఆనందం కలిగించలేదు. నా చేతిలోని శిశువును నా భార్య ప్రక్కన పడుకోబెడుతూ "నేనే గెలిచాను" అన్నాను మా ఆవిడతో. నా భార్యకు ఏమీ అర్థం కాక నా వైపు అయోమయంగా చూసింది. జరిగినదంతా చెప్పాను మా ఆవిడతో.


ఆ పాప గుడ్డి వెలుతురులో నా కుడిచేయి బొటనవ్రేలు పట్టుకుని, నన్ను చూసి బోసిగా నవ్వింది. నా ఆనందానికి అవధుల్లేవు.

"ఎందుకంటే! నేను ఒక బాబుకు తండ్రి నయ్యానన్న ఆనందంకంటే, ఒక శిశువును రక్షించి తండ్రికాని తండ్రి అయినందుకే నాకు ఎక్కువ ఆనందంగా ఉంది." ❃

---

# (గళ్ళ) నుడి కట్టండి!

– నిర్వహణ : బాబు



**పజిల్ చేరవలసిన తేది 7-4-2001**

**అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన వార్ని లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి 5 గురికి రూ. 75/- చొప్పున అందచేస్తాము**

## అడ్డం

1. రామాయణం తర్వాత మహా - పురాణం
3. సన్నాయి తోటిది.
5. నోరు మంచిదైతే ఇదీ మంచిదే.
6. మాగడ కాదు, అతినే పదార్థం మీదే.
8. అప్పుడప్పుడూ వాయించేది తిరగ బడింది.
10. ఆవిడ చేసిన వడ పదార్థం
13. మగ చెవిలో పువ్వు, మరి ఆడ తలలో......?
15. రాక్షసుడు

## నిలువు

2. పోరు లాంటిది - గడతో అంతం. ఇంగ్లీషు తలుపు
4. గరీబు కాకపోతే.....
7. బాషరాయటానికి ఇవి తెలియాలి!
9. లక్షణంగా వుందీ సంఖ్య
11. వగచుట ఏల? రుచిగా లేదా?
12. పుస్తకాన్ని అట్టిపెట్టుకుని గట్టిగా వుంచేది, పాపం తలికందులయ్యింది.
14. గిలిగింతలు పెడితే వస్తుంది. అది తిరగబడింది.